క్లుప్తంగా

బడ్డింగ్ సైంటిస్ట్ విజేతకు అభినందన



బెల్లాల సహస్రని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో చెన్నైలో ఇటీవల నిర్వహించిన మాక్‌మిలన్ బడ్డింగ్ సైంటిస్ట్–24 పోటీల్లో ఆపిల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న బెల్లాల సహస్రని, అక్షిత, మిశ్రా బృందం పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ కాన్సెప్ట్‌లో భాగంగా రూపొందించిన డోర్ సెక్యూరిటీ సెన్సార్ అండ్ సిస్టం ప్రాజెక్ట్ టాప్‌లో నిలిచింది. ఈ పోటీల్లో మొత్తం 1132 ప్రాజెక్టులు రాగా అందులో సౌత్ జోన్ నుంచి ఈ విద్యార్థుల బృందం టాప్‌లో నిలిచింది. ఈ మేరకు నడుపూరుకు చెందిన బెల్లాల సహస్రని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, ధర్మాల శ్రీను, బెల్లాల పెంటబాబు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రచారం



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గాజువాక : ఓటు హక్కు ప్రాధాన్యంపై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో భాగంగా వారు గాజువాకలోని చిట్టినాయుడు కాలనీ, గొంతినవానిపాలెంతో పాటు పెదగంట్యాడలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాంప్‌లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. తమ క్యాంప్‌ను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు జె.రాధ, వై.వి.ఎస్.లక్ష్మి, వి.భాను ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

చీఫ్ వార్డెన్‌గా ఈశ్వర్ కుమార్ నియామకం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఈశ్వర్ కుమార్

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్‌గా ఏయూ ఫార్మసీ కళాశాల ఆచార్యులు కె.ఈశ్వర్ కుమార్ నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. అనంతరం కార్యాలయలో బాధ్యతలను చేపట్టారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి వేచి ఉన్న భక్తులు



మిందె ఉమా రామలింగేశ్వరాలయంలో..



బాలచెరువులోని శివాలయంలో పంచదారతో అభిషేకం చేస్తున్న అర్చకులు



అప్పికొండ తీరంలో సూర్యుడికి అర్ఘ్యం సమర్పిస్తున్న యువతి

జాగరణ.. శివ నామస్మరణ



అప్పికొండ తీరంలో శుక్రవారం రాత్రి జాగరణ చేస్తున్న భక్తులు

- జనసంద్రంగా మారిన అప్పికొండ తీరం
- లింగోద్భవ వేళ ప్రతిధ్వనించిన పంచాక్షరి
- సోమేశ్వరుని సన్నిధిలో భక్తుల జాగరణ
- శనివారం పుణ్యస్నానాల ఆచరణ

పెదగంట్యాడ: అప్పికొండ తీరం శివ నామస్మరణతో హోరెత్తింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు శనివారం ఉదయం సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సోమేశ్వరస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. అప్పికొండతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో పాటు నగరం నలుమూలల నుంచి వచ్చిన వారితో సముద్ర తీరం నిండిపోయింది. భక్తజన సంద్రంగా మారిపోయింది. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రంతా భక్తులు మహాదేవుడి నామస్మరణ చేశారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ కొవిరి గంగరాజు కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వరస్వామి

రామలింగేశ్వరుడికి పంచదారతో అభిషేకం

జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శుక్రవారం అర్ధరాత్రి పంచదారతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రంతా శివనామస్మరణ చేస్తూ జాగరణ చేశారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

అగనంపూడి: అగనంపూడి బ్రహ్మకుమారీ సంస్థ (దివ్యజ్యోతి భవనం) ఆధ్వర్యంలో మహా శివరాత్రి పూజలు కొనసాగాయి. ఆవరణలో ద్వాదశ జ్యోతిర్లింగాల ఏర్పాటుతో పాటు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం విశేష పూజ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం పూజలు, బ్రహ్మభోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి రాజయోగి బీకే వేణి, కోఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి, అగనంపూడి ఇన్‌చార్జి రామకోటి పాల్గొన్నారు.

మిందె ఆలయంలో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు మిందిలోని ఉమా రామలింగేశ్వరాలయంలో పరమేశ్వరుడు నిజరూపంలో దర్శనమిచ్చారు. శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రవిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో కమిటీ ప్రతినిధులు ఈటి విజయశంకరరావు, సిగటాపు అప్పలరాజు, పైడా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



జాతరలో భక్తుల సందడి



అప్పికొండ తీరంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న బ్రహ్మకుమారి ప్రతినిధులు

భారీ అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్‌లో శనివారం భారీ అన్న సమారాధన జరిగింది. కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం 18వ వార్షికోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా పూజలు, హోమాలు, వరసిద్ధి వినాయకుని కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమారాధనలో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పూజలో భాగంగా వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు. సీబీఐ మాజీ జేడి వి.వి.లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు కోటేశ్వరరావు, జగన్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పికొండలో ఉక్కు ఉద్యోగి మోడేకుర్తి సేవలు



అప్పికొండ తీరంలో పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ చేస్తున్న మోడేకుర్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం. విభాగం సీనియర్ ఫోర్‌మన్ మోడేకుర్తి సత్యనారాయణ మహాశివరాత్రి సందర్భంగా అప్పికొండ సముద్రతీరంలో సేవలు అందించారు. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సత్యనారాయణ ఏటా శివరాత్రికి అప్పికొండ తీరాన, చందనోత్సవం నాడు సింహాచలంలో సేవలు అందిస్తుంటారు. ఈ ఏడాది కూడా శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు అప్పికొండ సముద్ర తీరంలో పోలీసు విభాగం ఏర్పాటు చేసిన పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా సముద్ర స్నానాలు చేసే ప్రజలకు నిరాటంకంగా సూచనలు చేశారు. గత 30 ఏళ్లుగా ఇదే విధంగా సేవలు అందిస్తున్న సత్యనారాయణను సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

సోమేశ్వరస్వామి ఆదాయం రూ.10.15 లక్షలు

- అప్పికొండ ఆలయంలో హుండీల లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి రెండు రోజుల్లో రూ.10,15,746 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి జగన్నాథం తెలిపారు. శనివారం ఉదయం ఆలయంలోని హుండీలను లెక్కించినట్లు తెలిపారు. టికెట్ల రూపంలో రూ.4,02,180, ప్రసాదం అమ్మకాల ద్వారా రూ.2,77,980, హుండీ ఆదాయం రూ.3,15,586, కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.20 వేలు ఆదాయం వచ్చిందని వివరించారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల భవిష్యత్తు కోసం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1122వ రోజు, శనివారం సంస్థకు చెందిన సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికుల పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో కార్మికులు పట్టు వదలకుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నారని, ఇది దేశ చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని అన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. భావితరాలకు కాలుష్య రహిత, ప్లాస్టిక్ ఫ్రీ సమాజాన్ని అందించడమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై 87వ వార్డు తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో సందర్శకులకు సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్సులు, నార సంచులను ఉపయోగించాలని, విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గుంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఎకో వైజాగ్ లక్ష్యాలు సాధించి, రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో విశాఖ నగరానికి మొదటి ర్యాంకు రావడానికి ప్రజలందరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, భాస్కరరావు, తిరుపతిరావు, మన్మథరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ముగిసిన పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ వార్షిక జాతర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు



భక్తజన సందోహం



దుర్గాలమ్మ ఊరేగింపు

డాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం జాతరను పురస్కరించుకుని ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు కలశాలతో పసుపు కుంకుమ నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం జరిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శనివారంతో ముగిసాయి.

16న మారువారం..

అమ్మవారి మారువారాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న 108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు. 17 మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద ఐదు వేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి

- ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు
- ముగిసిన జాతీయ భద్రత వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్టీపీసీ ఉన్నతాధికారులు

పరవాడ: భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ విభాగంలో సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషిని అభినందించారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఓ అండ్ ఎం జీఎం సురేష్ జాన్‌డేవిడ్ మాట్లాడుతూ సింహాద్రిలో ప్రమాద రహిత పని వాతావరణాన్ని పెంపొందించడానికి యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఉద్యోగులు, కార్మికులు ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాలన్ చెప్పారు. భద్రత వారోత్సవాల్లో ఉద్యోగులు, పాఠశాలల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, భద్రత పోటీలు, సేఫ్టీ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు 12 నుంచి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కేజీబీవీ ఎస్‌వో మృదుల ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వీటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు కూడా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనాథలు, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశాలకు–40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు–40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

రూ.20,360 నగదు స్వాధీనం

సబ్బవరం: మండలంలోని ఇరువాడ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని సబ్బవరం పోలీస్‌లు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్టు పేర్కొన్నారు.